# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 235
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
జూన్ 18, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## ఏసీబీ ట్రాప్ లో విద్యుత్ అధికారి

- రూ.80వేలు లంచం తీసుకుంటుండగా అదుపులోకి
- ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో దాడులు

# ఉలిక్కిపడ్డ వెలిశాల






- మారేడుమిల్లిలో భారీ ఎన్ కౌంటర్
- మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి మృతి
- వైఎస్సార్ ప్రభుత్వంలో శాంతి చర్చల ప్రతినిధిగా పాల్గొన్న నేత
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు
- రవిపై రూ.25లక్షల రివార్డ్
- మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ




జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల గ్రామం బుధవారం ఉలిక్కిపడింది. నాడు విప్లవ ఉద్యమాలకు ఊత మిచ్చిన వెలిశాల నేడు శోకసంద్రంలో మునిగిపోయింది. బుధవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్ కౌంటర్ లో వెలిశాల గ్రామానికి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు, ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శి గాజర్ల రవి అలియాస్ ఉదయ్ నేలకొరగడంతో వెలిశాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయనతో పాటు మావోయిస్టు ఏఓబీ స్పెషల్ జోన్ కమిటీ సభ్యులు, మావోయిస్టు పార్టీ అగ్రనేత చలపతి భార్య అరుణ, దళ సభ్యుడు అంజు మృతి చెందారు. 35 సంవత్సరాల క్రితం రవి తన అన్న సారయ్య అలియాస్ ఆజాద్ తో కలిసి  మావోయిస్టు పార్టీలో చేరారు. అన్నల బాటలోనే తన చిన్న తమ్ముడు అశోక్ సైతం నడిచాడు. అయితే ఆజాద్ ఎన్ కౌంటర్ లో మృతి చెందగా తమ్ముడు అశోక్ లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. గాజర్ల రవి భార్య జిల్లాని మేఘం కూడా గతంలో జరిగిన ఎన్ కౌంటర్ లోనే మృతి చెందగా, నేటి ఎదురు కాల్పుల్లో రవి అసువులుబాశాడు. అయితే వైఎస్సార్ ప్రభుత్వంతో శాంతి చర్చల ప్రతినిధిగా రవి ప్రముఖ పాత్ర పోషించారు. రవి మృతితో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. పలు కేసుల్లో దోషిగా ఉన్న రవిపై రూ.25లక్షల రివార్డ్ కూడా ఉంది. రవి మృతితో మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు2లో..


8లో..

## యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలి

- నామినేటెడ్ పోస్టుల్లోనూ అవకాశం కల్పించాలి
- అధిక సంఖ్య ఉన్న కులాలను విస్మరించడం దారుణం
- 30న యాదవుల ఆత్మగౌరవ సభకు భారీగా తరలిరావాలి
- కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్


2లో..

## చిరు వ్యాపారులకు బీజేపీ అండ

- వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ | మార్కెట్ సమీపంలో రచ్చ బండ

# ఉలిక్కిపడ్డ వెలిశాల



- మారేడుమిల్లిలో భారీ ఎన్ కౌంటర్
- మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి మృతి
- వైఎస్సార్ ప్రభుత్వంలో శాంతి చర్చల ప్రతినిధిగా పాల్గొన్న నేత
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు
- రవిపై రూ.25లక్షల రివార్డ్
- మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఉత్తరాంధ్రలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా వెలిశాలకు చెందిన గాజర్ల రవి మృతి చెందాడు. ఈ ఘటనతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల ఉలిక్కిపడింది. నాడు విప్లవ ఉద్యమానికి ఊతమిచ్చిన వెలిశాల.. నేడు శోకసంద్రంలో మునిగింది. ఇదే గ్రామానికి చెందిన మావోయిస్ట్ పార్టీ అగ్రనేత గాజర్ల రవి అలియాస్ ఉదయ్ మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో నేలకొరిగారు. గాజర్ల రవి మృతి చెందడంతో కుటుంబసభ్యులు, బంధు మిత్రులు శోకసంద్రంలో మునిగారు. 1992లో పీపుల్స్ వార్ ఉద్యమంలోకి వెళ్లిన గాజర్ల రవి అంచెలంచెలుగా దళ సభ్యుడి స్థాయి నుంచి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై జరిగిన అలిపిరి దాడి ఘటనలో గాజర్ల రవి కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. ప్రస్తుతం మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడిగా, ఆంధ్ర–ఒడిషా బోర్డర్ (ఏవోబీ) కార్యదర్శిగా పనిచేస్తున్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రవిని మోస్ట్ వాంటెడ్ మావోయిస్టుగా ప్రకటించింది.

### ముగ్గురి మృతి..

ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల పరిసరాల్లోని కొండమొదలు, చింతకూరు, కొయ్యలగూడెం అటవీ ప్రాంతాల్లో మావోయిస్టు అగ్ర నేతలు సంచరిస్తున్నారన్న పక్కా సమాచారంతో అల్లూరి జిల్లా పోలీసులు, గ్రూహౌండ్స్ సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి నుంచి కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం వారికి మావోయిస్తులు ఎదురుపడగా ఇరువర్గాల మధ్య భీకర ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎన్ కౌంటర్లో గాజర్ల రవితోపాటు మావోయిస్టు ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ సబ్యులు, మావోయిస్టు పార్టీ అగ్రనేత చలపతి భార్య అరుణ అలియాస్ చైతన్యకు తీవ్రమైన బుల్లెట్ గాయాలు కాగా వారు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. అరుణపై రూ.20 లక్షల రివార్డు ఉంది. ఈ కాల్పుల్లో ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ ఏసీఎం అంజు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. ఎన్ కౌంటర్ జరిగిన స్థలంలో మూడు ఏకే–47 రైఫిళ్లతోపాటు భారీగా మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల మృత దేహాలను రంపచొడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### కుటుంబమంతా ఉద్యమబాటే..

పెత్తందార్ల వ్యవస్థకు వ్యతిరేకంగా తాడిత, పీడిత, బలహీన వర్గాల కోసం పోరుబాట ఎంచుకున్న వారిలో వెలిశాలలోని గాజర్ల కుటుంబం ఒకటి. గాజర్ల కుటుంబంలోని నలుగురు సోదరుల్లో పెద్దవాడైన సమ్మయ్య సింగరేణిలో పనిచేసి పదవీ విరమణ చేసి హనుమకొండలో స్థిరపడ్డారు. అయినప్పటికీ ఆయనపై కూడా మావోయిస్టు సానుభూతిపరుడిగా ముద్రవేయడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మిగతా ముగ్గురు అప్పటి పీపుల్స్ వార్ ఉద్యమంలో చేరి అజ్ఞాతంలోకి వెళ్ళారు. వీరిలో గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్ గతంలోనే ఎన్ కౌంటర్ లో మృతి చెందగా నాలుగు దశాబ్ధాలు మావోయిస్టు పార్టీలో పనిచేసిన గాజర్ల రవి బుధవారం జరిగిన ఎన్ కౌంటర్ లో నేలకొరిగారు. రవి భార్య కూడా గతంలో జరిగిన ఎదురకాల్పుల్లోనే మృతి చెందడం గమనార్హం. మరో సోదరుడు గాజర్ల అశోక్ అలియాస్ ఐతు కూడా అజ్ఞాతంలోనే ఉండి అనారోగ్య కారణాలతో జనజీవన స్రవంతిలో కలిశారు. పోరుబాట వీడి కొంతకాలం పాటు మీడియాలో చేరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి పనిచేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పరకాల నియోజకవర్గం నుంచి టికెట్ కోసం ప్రయత్నించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

### ప్రభుత్వంతో చర్చలు..

గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్ ఉమ్మడి ఆంధప్రదేశ్ అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 2004 అక్టోబర్‌లో జరిపిన శాంతి చర్చల్లో మావోయిస్టు పార్టీ తరపున ప్రతినిధిగా పాల్గొన్నారు. ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హోదాలో శాంతి చర్చల్లో పాల్గొన్నారు. శాంతి చర్చల ఎజెండాను తయారు చేయడంలోనూ రవి కీలక పాత్ర పోషించారు. ఎన్కౌంటర్ లో మృతిచెందిన గాజర్ల రవి అలియాస్ గణేశ్ పై రూ.25 లక్షల రివార్డ్ ఉన్నది. పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసిన రవి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. ఏవోబీ, తెలంగాణ, ఛత్తీస్ గఢ్ అటవీ ప్రాంతాలపై రవికి గట్టి పట్టు ఉంది. ఎన్నో దాడుల్లో కీలకంగా వ్యవహరించారు.

### ఆగని ఎన్ కౌంటర్లు..

ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మారణహోమాన్ని వెంటనే నిలిపివేయాలని కోరుతూ హైదరాబాద్ లోని ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా నిర్వహించాయి. ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలంటూ పలువురు డిమాండ్ చేశారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తమ్మినేని వీరభద్రం, నారాయణమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నా జరిగి 24 గంటలు కూడా గడవక ముందే మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగి అగ్రనేతలు ముగ్గురు నేలకొరిగారు. మావోలను అంతమొందించాలని కేంద్రం కంకణం కట్టుకుంది. ఈ సమయంలో ఇక చర్చలకు తావు లేదన్న విధంగా కేంద్రం మొండిగా వ్యవహరిస్తోంది. కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత కానీ, మణిపూర్‌లో అల్లర్లు అణచివేయడంలో కానీ ఇంత దూకుడు కనిపించడం లేదు.

# బూత్ అధ్యక్షుడికి ఆర్థిక సాయం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా కాశిబుగ్గ మండల పరిధిలోని 21 వ డివిజన్ బీజేపీ 71 వ బూత్ అధ్యక్షులు దేవులపల్లి రాకేష్ భార్య ఇటీవల సీకేఎం హాస్పిటల్ లో డెలివరీ అయినందున ఆరోగ్య ఖర్చుల కోసం వ్యాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థిక సాయాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ అందజేశారు. వన్నాల వెంకటరమణ సోదరుడు డాక్టర్ వన్నాల అరవింద్ కుమార్ స్థాపించిన సమైక్య వ్యాక్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు సుమారు 600 పైచిలుకు కుటుంబాలకు నెలకు 10 కిలోల బియ్యం సరఫరా చేయడంతోపాటు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి అవసరం ఉన్నవారికి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లల చదువులకు ఆర్థిక సాయం, ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాశిబుగ్గ మండల అధ్యక్షులు అపురూప రజనీష్ నేత, వరంగల్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నోముల రతన్, మండల కార్యదర్శి గాదె భిక్షపతి, సురేందర్ పాల్గొన్నారు.





# చిరు వ్యాపారులకు బీజేపీ అండ

- వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- మార్కెట్ సమీపంలో రచ్చ బండ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** చిరు వ్యాపారస్తులకు భారతీయ జనతా పార్టీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ హామీ ఇచ్చారు. వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గం పరిధిలోని 27వ డివిజన్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ సమీపంలో శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో బుధవారం రచ్చ బండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనా గంట రవికుమార్ మాట్లాడుతూ వికసిత్ భారత్ అమృతకాలం 11 సంవత్సరాలన్నారు. సేవ, సూపరిపాలనే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బడుగు బలహీనవర్గాలకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్న సంకల్పంతో చిరు వ్యాపారస్తులు, ప్రజలను కలిసి బీజేపీ నాయకులు కలిసి వివరించారు. అనంతరం అక్కడి ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి అభివృద్ధి బీజేపీ ఎల్లవేలలా కృషి చేస్తుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శిలు వైట్ల గణేష్, సూర శ్రీనివాస్, నాయకులు సుంచు కేశవ్, తాళ్లపెల్లి శ్రీనివాస్, బండి సుజాత, ఉప్పుల సురేందర్, ప్రోగ్రాం కన్వీనర్ జోగు మధు, కన్వీనర్లు, కో–కన్వీనర్లు బోడకుంట్ల శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

# జనగణన, కులగణన 2025లోనే చేపట్టాలి

## ◆ తాటిపాముల వెంకట్రాములు డిమాండ్



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** దేశంలో జనగణనతో పాటు కులగణనను 2025లోనే పూర్తి చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. భూపాలపల్లిలో భీమనాథుని సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన బీసీ హక్కుల సాధన సమితి జిల్లా రెండవ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రాములు ఈ మేరకు ప్రసంగించారు. బీసీ సంఘాల పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దేశ జనగణనలో కులగణనకు ఆమోదించి గెజిట్ ప్రకటన చేసిందని వెంకట్రాములు గుర్తుచేశారు. అయితే, 2021లో జరగాల్సిన జనగణనను కుంటి సాకులతో వాయిదా వేసి, 2027లో నిర్వహిస్తామని చెప్పడం బీసీలను మోసం చేయడమేనని ఆయన ఆరోపించారు. 2025లోనే జనగణనను పూర్తి చేసి బీసీల పట్ల తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కేంద్రాన్ని కోరారు. చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి, మహిళా రిజర్వేషన్లలో బీసీ కోటా నిర్ణయించాలి, జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి బీసీల అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు చేయాలి, స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు జరపాలి, "సకల రంగాలలో మేమెంత, మాకంత" నినాదంతో బీసీలందరూ సమైక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి, రాష్ట్ర నాయకులు పనస ప్రసాద్ మాట్లాడుతూ, హక్కుల సాధన కోసం పోరాడేందుకు బీసీలలో చైతన్యాన్ని పెంపొందింపజేసి గ్రామస్థాయి నుంచి బీసీ సంఘాలను బలంగా నిర్మించాలన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, బీసీ ఉద్యమాలకు సీపీఐ ఎల్లవేళలా అండదండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల శ్రీకాంత్ మాట్లాడుతూ, అన్ని రంగాలలో వెనుకబడిన బీసీల సంక్షేమానికి, అభివృద్ధికి అంకితభావంతో పోరాడుతామని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు క్యాతరాజు సతీష్, మెరుగు రమేష్, మేడి శేఖర్, రమేష్ చారి, భద్రయ్య, గోలి లావణ్య, సంధ్య భారతి, యాకుబీ భద్రమ్మతో పాటు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు పాల్గొన్నారు.

# వరంగల్ ట్రాఫిక్‌పై అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు క్షేత్ర సమీక్ష



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** వరంగల్ నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్) ప్రభాకర్ రావు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన బుధవారం ఎంజీఎం జంక్షన్, పోచమ్మ జంక్షన్, వరంగల్ చౌరస్తా, పోస్ట్ ఆఫీస్ జంక్షన్లను సందర్శించి, ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా వరంగల్ ట్రాఫిక్ సీఐ కే. రామకృష్ణకు పలు కీలక సూచనలు చేశారు. జెమిని టాకీస్ వైపు నుంచి పోచమ్మ మైదాన్ వైపు వెళ్లే ట్రాఫిక్ సిగ్నల్స్‌కు అడ్డుగా ఉన్న పాత సిగ్నల్ పోల్స్‌ను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. తిరుమల ఎలక్ట్రానిక్స్ నుంచి దేశాయిపేట వైపుగా ఫ్రీ లెఫ్ట్ కోన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. భద్రకాళి డ్రెస్సెస్ షాపు ఎదురుగా ఉన్న మ్యాన్‌హోల్ సమస్య గురించి జీడబ్ల్యూఎంసీ ఏఈకి తెలియజేసి, దానిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అండర్ బ్రిడ్జి నుంచి చౌరస్తాకు వెళ్లే ఫ్రీ లెఫ్ట్ రూట్‌లో అడ్డుగా ఉన్న ట్రాఫిక్ బూత్‌ను తక్షణమే తొలగించాలని సూచించారు. అలాగే, అన్ని జంక్షన్లలో ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు స్పష్టం చేశారు. వరంగల్ ట్రాఫిక్ సీఐ కే. రామకృష్ణతో పాటు ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# శాఖమూరి సుగుణ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో చురుకుగా పాల్గొన్న పోరాట యోధురాలు శాఖమూరి సుగుణ (91) ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని సీఆర్ వృద్ధాశ్రమంలో కన్నుమూయడం అత్యంత బాధాకరమని సీపీఐ వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి, బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. సుగుణ ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు దివంగత ఎస్వీకే ప్రసాద్ సతీమణి అని వెంకట్రాములు గుర్తు చేశారు. ఎస్వీకే ప్రసాద్ తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర వహించారని, వారితో పాటు వారి సతీమణి సుగుణ కూడా ఆ పోరాటంలో చురుకుగా పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు. ఎస్వీకే ప్రసాద్ భారత కమ్యూనిస్టు పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శిగా 1953 నుంచి 1961 వరకు బాధ్యతలు నిర్వహించి, జిల్లాలో పేద ప్రజలకు భూమి కోసం, భుక్తి కోసం అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని తెలిపారు. 1957లో చెన్నూరు శాసనసభ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై శాసనసభలో ప్రజావాణిని వినిపించారన్నారు. "చివరి శ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతం కోసం పాటుపడిన సుగుణ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, ప్రజా పోరాటాలకు తీరని లోటు" అని తాటిపాముల వెంకట్రాములు జోహార్లు అర్పించారు.

# జనగామ జిల్లాలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎక్కడ ?

## ● నకిలీ మందులపై జీఎంపీఎస్ ఆగ్రహం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** జనగామ జిల్లాలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ల జాడ లేకపోవడం, మెడికల్ షాపుల్లో నకిలీ మందుల విక్రయాలు యథేచ్ఛగా సాగుతుండటంపై గొర్రెల మేకల పెంపకందారుల సంఘం (GMPS) మండల కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రఘునాథపల్లి మండలంలోని ఖిలాసాపురం, మేకలగట్టు, రామార్యాని బంగ్లా గ్రామాలలో ఐదో రోజున నిర్వహించిన గొర్రెల మేకల పెంపకం దారుల సహకార సొసైటీ ఎన్నికల సమావేశాల్లో ఈ డిమాండ్ తెరపైకి వచ్చింది. ఈ సమావేశాల్లో జీఎంపీఎస్ మండల గౌరవ అధ్యక్షుci (సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ డైరెక్టర్) కావటి యాదగిరి, మండల అధ్యక్షులు గుండా వెంకటయ్య, గద్ద రాజులు పాల్గొని మాట్లాడారు. మండలంలోని అనేక గ్రామాలలో గొర్రెలు, మేకలకు వైద్యులు సిఫార్సు చేసిన మందులకు బదులుగా, మెడికల్ షాపుల్లో నకిలీ మందులు, కొత్త శాంపిల్ మందులు విచ్చలవిడిగా అమ్ముడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "జనగామ జిల్లాలో డ్రగ్స్ అధికారులు ఎక్కడ ఉంటున్నారో, ఏమి చేస్తున్నారో ఎవరికీ తెలియడం లేదు. అసలు డ్రగ్స్ అధికారులు జనగామ జిల్లాలో ఉన్నారా అని కూడా ప్రజలకు సందేహం కలుగుతోంది" అని వారు వ్యాఖ్యానించారు. అధికారులు ఎప్పుడు కూడా ఎక్కడా తనిఖీలు చేసిన దాఖలాలు లేవని, గ్రామీణ ప్రాంతాల్లోని మెడికల్ షాపుల వారు గొర్రెల పెంపకందారులకు నకిలీ శాంపిల్ మందులు అమ్ముతున్నారని వారు ఆరోపించారు. వెంటనే జిల్లాలోని అన్ని పశువుల మెడికల్ షాపుల్లో తనిఖీలు చేపట్టాలని, నకిలీ మందుల విక్రయాలను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా గొర్రెలకు, మేకలకు, పాడిపశువులకు సరిపోను మందులు అందించి ఆదుకోవాలని జీఎంపీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. బక్క యాదగిరి, బక్క సాంబరాజు, పుట్టపాక సమయ్య, కడారి యాదగిరి, ఉడుత వేణుగోపాల్, ఉడుత సురేష్, దాసరి రవి, చీమల రవి పాల్గొన్నారు.

# గిన్నిస్ రికార్డు సాధించిన మార్షల్ ఆర్ట్స్ కోచ్ మణికంఠ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాకు చెందిన కరాటే కోచ్ మణికంఠ గడదాసు గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సొంతం చేసుకొని వరంగల్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించాడు. ఫిబ్రవరి 8న చెన్నైలో వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ నిర్వహించిన ప్రపంచంలోనే అతిపెద్ద కరాటే పాఠంలో (ఒకే వేదికపై) పాల్గొని మణికంఠ ఈ అరుదైన ఘనతను సాధించాడు. ప్రపంచ కరాటే చరిత్రలో ఇది తొలిసారి జరిగిన రికార్డు కావడం విశేషం. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ, గిన్నిస్ వరల్డ్ రికార్డులో తన పేరు నమోదు చేయాలనే తన కలను ఇప్పుడు సాకారం చేసుకున్నందుకు ఎంతో గర్వంగా, సంతోషంగా ఉందని తెలిపారు. వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.బాల మురుగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, తన తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులకు కృతజ్ఞతలు తెలియజేశాడు. ప్రస్తుతం తాను చాలా మంది విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇస్తున్నానని, తన విద్యార్థులు కూడా తనలాగే అవార్డులు, రికార్డులు సాధించేలా కృషి చేస్తానని మణికంఠ పేర్కొన్నాడు.

# ఉచిత యోగా తరగతులను సద్వినియోగం చేసుకోండి

## యోగా గురువు రాజేశ్వరరావు పిలుపు



**వరంగల్ వాయిస్, పరకాల :** అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న జరగనున్న నేపథ్యంలో, దాని కౌంట్‌డౌన్‌గా పరకాలలో ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 5:30 నుండి 7:00 గంటల వరకు గణపతి డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ తరగతులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా యోగా గురువు కొలుగూరి రాజేశ్వరరావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తప్పకుండా రోజూ యోగా చేయాలని సూచించారు. యోగా చేయడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు దరిచేరవని, మన ఆత్మ, శరీరం మన ఆధీనంలో ఉంటాయని ఆయన వివరించారు. "యోగా చేద్దాం, అందరం ఆరోగ్యంగా ఉందాం, హద్దులు దాటి యోగా సెలబ్రేట్ చేసుకుందాం" అని రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ఈ ఉచిత యోగా తరగతులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# రామాలయానికి పూజా సామాగ్రి అందజేత



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సోమేశ్వర మెడికల్ స్టోర్స్ నిర్వాహకులు పబ్బ వర్షిని–రాకేష్ దంపతులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని, ఆలయానికి రూ. 3,000 విలువైన నిత్య ధూప దీప పూజా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన గౌడ్, కమిటీ సభ్యులు బండారు శంకర్, మూల శ్రీనివాస్ గౌడ్, బాటిక స్వామి, మాదాసు అర్జున్, మాదాసు మొగిలి, బూర రాజగోపాల్, పాండవుల భద్రయ్య, దయ్యాల భద్రయ్య, ఉయ్యాల భిక్షపతి పాల్గొన్నారు.

# ఖరీఫ్ పంటకు గణప సముద్రం చెరువు నీరు విడుదల

## ● ఎమ్మెల్యే జీఎస్సార్ చేతుల మీదుగా ప్రారంభం



**వరంగల్ వాయిస్, గణపురం:** మండలంలోని గణప సముద్రం సరస్సు నుంచి ఖరీఫ్ పంటల సాగు కోసం భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) బుధవారం నీటిని విడుదల చేశారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ, రైతుల పొలాలకు నీరు సక్రమంగా చేరేందుకు కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించినట్లు తెలిపారు. రైతులు ముందుగానే వరి నార్లు పోసుకొని వరి పంటలను వేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా, రైతులు భూసారం పెంచుకోవడానికి పచ్చిరొట్ట ఎరువులను వినియోగించాలని, యూరియాను అనవసరంగా అధిక మొత్తంలో వాడకుండా అవసరాన్ని బట్టి మాత్రమే వాడాలని హితవు పలికారు. పశువుల ఎరువును కూడా వినియోగించాలని సూచించారు. నీటిని ముందస్తుగా విడుదల చేయడంతో గణపురం రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

# కలెక్టర్ స్నేహ శబరీష్‌ను కలిసిన ఉద్యోగ సంఘం నేతలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** హనుమకొండ జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన స్నేహ శబరిష్ ను బుధవారం తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా కమిటీ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు నవీన్ కుమార్, మున్సిపల్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్, బొక్క ఏలియా,వెంకట స్వామి ఇతర సభ్యులు పాల్గొన్నారు.


# ఫెర్టిలైజర్స్ పెస్టిసైడ్ అండ్ సీడ్స్ నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, చిట్యాల :** జయశంకర్ జిల్లా భూపాలపల్లి చిట్యాల మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ అందరూ కలిసి ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా గుమ్మడి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సర్వ రాజు, ప్రధాన కార్యదర్శిపువ్వటి హరికృష్ణ, సహాయ కార్యదర్శికైరిక కిషన్ రావు, కోశాధికారి జిన్నె వేణు, కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస్, గంజి రవీందర్, జోగు భానుచందర్, మారెళ్ల దేవేందర్ రెడ్డి, గుండెబోయిన మహేందర్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ మాట్లాడుతూ అందరూ కలిసి ఏకగ్రీవంగా నన్ను ఎన్నుకున్నందుకు మనస్ఫూర్తిగా మీ అందరికీ అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. నేటి నుంచి రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు, సమయానికి అందించేందుకు ఈ అసోసియేషన్ బలంగా కృషి చేస్తుందని తెలిపారు.

# అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

## మానవత్వం చాటుకున్న వావిల్ల రమేష్



**వరంగల్ వాయిస్, రేగొండ :** రేగొండ మండలంలో అనారోగ్యంతో మతిస్థిమితం కోల్పోయి మరణించిన ఓ అనాథ వృద్ధురాలికి కాంగ్రెస్ నాయకుడు వావిల్ల రమేష్ దహన సంస్కారాలు నిర్వహించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ ఘటన స్థానికంగా పలువురి ప్రశంసలు అందుకుంది. గతంలో ఈ వృద్ధురాలిని పిచ్చికుక్కలు దాడి చేయగా, రమేష్ స్వయంగా ఆమెను రేగొండ పీహెచ్‌సీలో చేర్పించి చికిత్స అందించారు. అయితే దురదృష్టవశాత్తు ఆమె ఆరోగ్యం క్షీణించి రేగొండ మండల కేంద్రంలో రోడ్డు పక్కనే మరణించింది. పని నిమిత్తం మండల కేంద్రంలో ఉన్న రమేష్, వృద్ధురాలు కిందపడి ఉన్న విషయాన్ని గమనించి చూడగా ఆమె అప్పటికే ప్రాణాలు కోల్పోయిందని నిర్ధారించారు. వెంటనే ఈ విషయాన్ని స్థానిక ఎస్సై సందీప్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సై ఆదేశాలతో జేసీబీని, గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను పంపించగా, రమేష్ స్వయంగా దగ్గరుండి దహన కార్యక్రమాలను పర్యవేక్షించారు. గ్రామ పంచాయతీ కారోబార్ ముష్కే రమేష్, పోలీస్ సిబ్బంది, స్థానికులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఒక అనాథ వృద్ధురాలికి గతంలో ఆపన్నహస్తం అందించి, ఇప్పుడు ఆమె అంత్యక్రియలను నిర్వహించడం పట్ల వావిల్ల రమేష్‌ను పలువురు అభినందించారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగుల పంపిణీ



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద, కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన 100 మంది నిరుపేదలకు ఇళ్ల ప్రొసీడింగులను పంపిణీ చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు కృషి ఫలితంగా ఈ ఇళ్లు మంజూరయ్యాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి–రవీందర్, వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య గౌడ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ప్రొసీడింగులను అందజేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ లబ్ధిదారులు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇళ్లను చూశామని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే వాటిని చూస్తున్నామని ఆనంద భాష్పాలతో తెలిపారు. నిరుపేదల కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీ వెంట, నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్ బాబు వెంట నడుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కిన్నెర కృష్ణమూర్తి, మాజీ ఉపసర్పంచ్ మౌటమ్ రమేష్ బాబు, అన్కార్ అశోక్, చేరాల రోహిత్, వైనాల సాంబయ్య, ఆడెపు విజయ తదితరులు పాల్గొన్నారు.

# కమలాపూర్‌లో భూభారతి రెవెన్యూ సదస్సు



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రంలో తహసిల్దార్ సురేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సును కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి– రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఝాన్సీ రాణి రవీందర్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొన్న సమస్యలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూభారతి విశిష్టత గురించి రైతులకు సవివరంగా తెలియజేశారు. అనంతరం రైతుల నుండి దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య గౌడ్, డైరెక్టర్ కిన్నెర కృష్ణమూర్తి, తరిగొప్పుల నరేష్, మాట్ల రాజేష్, అబ్బర వేణి అనిల్ కుమార్, రెవెన్యూ అధికారులు, గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# రేపు మండల స్థాయి ఎంపిక పోటీలు

**వరంగల్ వాయిస్, నడికూడ:** కరీంనగర్, హాకీంపేట, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం రేపు మండల స్థాయి ఎంపిక పోటీలు నడికూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగనున్నాయి. ఈ విషయాన్ని మండల విద్యాధికారి కే. హనుమంతరావు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనడానికి మూడవ తరగతి పూర్తి చేసి నాలుగో తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం శివకుమార్ పీడీని 810654 8121 నంబరులో సంప్రదించాలని సూచించారు.

# డ్రంకెన్ డ్రైవ్‌పై ఉక్కుపాదం

## ముగ్గురికి జైలు, 19 మందికి జరిమానా



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలో డ్రంకెన్ డ్రైవ్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 22 మంది వ్యక్తులను మేజిస్ట్రేట్ అబ్బోజు వేంకటేశం ఎదుట హాజరుపరిచారు. ఈ తనిఖీలు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, టి. సత్యనారాయణ ఏసీపీ పర్యవేక్షణలో జరిగాయి. కేసుల వివరాలను వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. రామకృష్ణ వెల్లడించారు. తుమ్మ సుమన్ (42, డ్రైవర్, కాశిబుగ్గ, వరంగల్), దేవర మల్లయ్య (38, కూలీ, కుమ్మరిగూడెం, కాజీపేట, హన్మకొండ) ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు. కంజర్ల రాజేష్ (33, డ్రైవర్, కదారిగూడెం, వర్ధన్నపేట, వరంగల్)కు రెండు రోజుల జైలు శిక్ష పడింది.జైలు శిక్ష పడిన ఈ ముగ్గురిని హుజూరాబాద్ సబ్ జైలుకు తరలించారు. మిగిలిన 19 మంది వ్యక్తులకు 33,000 రూపాయల జరిమానా విధించబడింది. అలాగే, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపిన ఒక వ్యక్తిని కోర్టులో హాజరుపరచగా, వారికి 500 రూపాయల జరిమానా విధించినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.

# వైభవంగా కల్చరల్ ఆర్ట్స్ టైమ్ ఫెస్టివల్

## తెలంగాణ కళా వైభవం ఆవిష్కృతం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, శ్రీ విఘ్నేశ్వర కళాక్షేత్రం ఆధ్వర్యంలో పర్వతగిరిలో "కల్చరల్ ఆర్ట్స్ టైమ్ ఫెస్టివల్" అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలో సుమారు 150 మంది కళాకారులు పాల్గొని భారీ ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సాగిన ఈ సాంస్కృతిక ప్రదర్శనలు తెలంగాణ మట్టి కళలకు పెద్ద పీట వేశాయి. డప్పుల నృత్యాలు, ఒగ్గుడోలు విన్యాసాలు, మహిళల బోనాల కోలాటాలు, చిందు యక్షగానాలు, శారద కళలు వంటి ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమ నిర్వాహకులు ప్రశాంత్, సతీష్ మాట్లాడుతూ, ముందు తరాలకు ఆదర్శంగా నిలిచేలా ఈ కల్చరల్ ఆర్ట్ టైమ్ ఫెస్టివల్‌ను ఓరుగల్లు గడ్డపై నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కళలకు, కళాకారులకు పుట్టినిల్లు ఓరుగల్లు అని అభివర్ణించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మంత్రి కొండా సురేఖ, శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, తెలంగాణ కళలను ప్రోత్సహిస్తున్న భాషా సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సంచాలకులు డా. మామిడి హరికృష్ణకు ధన్యవాదాలు తెలియజేశారు.

# ఎమ్మెల్యే పదవికి కౌశిక్ రెడ్డి అనర్హుడు

- పదవి అడ్డుపెట్టుకొని అరాచకాలు
- ఫ్రస్ట్రేషన్ లో బీఆర్ఎస్ నేతలు
- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్



**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తన పదవిని అడ్డుపెట్టుకొని అనేక బెదిరింపులు, అరాచకాలు, అక్రమాలు చేస్తున్నారని, తద్వారా హుజూరాబాద్ పరువు తీస్తున్నారని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లిలో గల శ్రీ భక్త ఆంజనేయ స్వామి 33వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కౌశిక్ రెడ్డి తప్పు చేశాడు కాబట్టే భయపడి ముందస్తు బెయిల్‌కు వెళ్లాడని ప్రణవ్ అన్నారు. గతంలో సన్నిహితంగా ఉన్న గ్రానైట్ వ్యాపారి కుటుంబ సభ్యులు ఏకంగా ఎమ్మెల్యేపై కేసు పెట్టడం అంటే కౌశిక్ రెడ్డి ఏ విధంగా అరాచకం చేశాడో అర్థం అవుతుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో గెలిపించకపోతే చస్తానని సెంటిమెంట్‌తో గెలిచి, ఇప్పుడు కేసు కొట్టివేయమని కోర్టుకు ఎక్కారని, న్యాయస్థానాలు ఎన్నిసార్లు మొట్టికాయలు వేసినా కౌశిక్ రెడ్డికి బుద్ధి రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇలాంటివి మానుకోవాలని సూచించారు.

### కౌశిక్ రెడ్డి పిచ్చి బీఆర్ఎస్ నేతలకు పట్టింది..

బీఆర్ఎస్ నాయకురాలు కవిత చెప్పినట్లుగా పార్టీలో దయ్యాలు ఉన్నాయని, ఆ దయ్యాలలో కౌశిక్ రెడ్డి మొదటి వరుసలో ఉంటారని ప్రణవ్ పేర్కొన్నారు. కౌశిక్ రెడ్డి పిచ్చి బీఆర్ఎస్ నాయకులకు పట్టిందని, అందుకే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ ఇంతకుముందు కొంచెం పద్ధతిగా మాట్లాడేవారని, ఇప్పుడు కౌశిక్ రెడ్డి వెనక ఉండడం వల్ల ఆ పిచ్చి కేటీఆర్‌కు పట్టినట్లుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఇంకోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని ప్రణవ్ హెచ్చరించారు. ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ విధానమని, గడిచిన పదిహేను నెలల్లో తమ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని ప్రణవ్ తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం అవినీతి, ఫోన్ ట్యాపింగ్, కార్ రేసింగ్‌లో అవినీతి, గొర్ల స్కాం లాంటి అవినీతిలో కూరుకుపోయారని ఆయన ఆరోపించారు.

### దళారులను నమ్మొద్దు..

దళిత బంధు విషయంలో లబ్ధిదారులు ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని ప్రణవ్ సూచించారు. గతంలో ఓట్ల కోసం దళితులను వాడుకున్నారని, అయితే ఇప్పుడు ఓట్లు లేకపోయినా హుజూరాబాద్ ప్రజల దళితుల కోసం ప్రభుత్వంతో మాట్లాడి దళితబంధు నిధుల విడుదలకు కృషి చేశామని అన్నారు. స్వచ్ఛందంగా అధికారులకు మీ పత్రాలు సమర్పించి నిధులు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల స్థాయి నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన బల్దియా కమిషనర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్‌పాయి, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను వరంగల్ పోలీస్ రేంజ్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె సీపీకి మొక్కను అందజేశారు. అనంతరం వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై ఇరువురు అధికారులు చర్చించారు. నగర అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణకు పరస్పర సహకారంపై వీరు చర్చించినట్లు తెలుస్తోంది.

# క్రీడా పాఠశాలల ప్రవేశాలకు మండల స్థాయి ఎంపికలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025–26 విద్యా సంవత్సరానికి గాను క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కొరకు అప్లై చేసుకున్న విద్యార్థులకు బుధవారం ఎంపిక ప్రక్రియ పూర్తయినట్లుగా పర్వతగిరి మండల విద్యా శాఖ అధికారి గాయపులింగారెడ్డి తెలిపారు. ఆర్ డీఎఫ్ కల్లెడ పాఠశాలలో విద్యార్థులకు నిర్ణయించబడిన అంశాలలో పరీక్షలు నిర్వహించి ఎంపికలు చేశారు. ఈ కార్యక్రమానికి పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి గాయపు లింగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 24, 25 తేదీల్లో జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహించబడతాయని జిల్లాస్థాయిలో ఎంపిక కాబడ్డ విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ఎంపికలు నిర్వహించి అనంతరం క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నం వెంకటేశ్వర్లు, పర్వతగిరి మండల ఫిజికల్ డైరెక్టర్లు (పీడీ)లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు (పీఈటీ)లు అనిల్ కుమార్, ఎండి పాషా, విజయలక్ష్మి, సురేష్, చందులాల్, స్రవంతి, స్వప్న, అపర్ణ, కవిత, రాజు, వేణు ఆర్ డీఎఫ్ కల్లెడ పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాస్ ఆర్డీఎఫ్ కాలేజ్ ప్రిన్సిపల్ జనార్ధన్ ఎమ్మార్పి సీసీవో జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్ట్



**వరంగల్ వాయిస్, సుబేదారి :** సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 40 క్వింటాళ్ల పిడిఎస్ (రేషన్) బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బియ్యం విలువ సుమారు రూ. 1,60,000 ఉంటుందని పోలీసులు తెలిపారు. సుబేదారి ఏఎస్ఐ పాపయ్య, కానిస్టేబుల్స్ మారేపల్లి ప్రభాకర్, సత్యనారాయణ నిన్న రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఒక మినీ గూడ్స్ వాహనం అనుమానాస్పదంగా కనిపించింది. పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా, డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వేగంగా వెళ్లిపోయాడు. దీంతో పోలీసులు వెంబడించి ఆ వాహనాన్ని పట్టుకున్నారు. తనిఖీ చేయగా, వాహనంలో తెల్లని ప్లాస్టిక్ సంచులలో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వాహనంలో ఉన్న ముగ్గురు వ్యక్తులను విచారించగా, వారు పల్లెపాటి సమ్మిరెడ్డి (టీవీ టవర్ కాలనీ, హనుమకొండ), మాలోతు వీరన్న (దేవగిరిపట్నం, ములుగు జిల్లా), మోతె రామాంజనేయులు (నాగుర్లపల్లి, రేగొండ మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా) అని గుర్తించారు. వీరు ముగ్గురూ కలిసి వివిధ కాలనీలలో, ప్రాంతాలలో రూ. 20 చొప్పున బియ్యాన్ని కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు అమ్ముకొని తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ బియ్యాన్ని సేకరించినట్లు తేలింది. ములుగు మండలం, జంగాలపల్లిలో ఉన్న సమ్మిరెడ్డికి చెందిన శ్రీ వెంకట సాయి రైస్ మిల్లులో రీసైక్లింగ్ చేయించడం కోసం జంగాలపల్లికి వెళ్తుండగా, తిరుమల జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వెంటనే పోలీసులు ఇద్దరు పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన ఏఎస్ఐ పాపయ్య, కానిస్టేబుల్స్ మారేపల్లి ప్రభాకర్, సత్యనారాయణలను సుబేదారి ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ అభినందించారు.

# పట్టుదలతో విద్యను అభ్యసించాలి

## డీఈఓ డాక్టర్ ఆంద్రు రవీందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, దోర్నకల్ :** పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుండే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఇందుకోసం ఏ రకమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలో టీచర్లు అమలు చేయాలని విద్యాశాఖ అధికారి డాక్టర్ ఆంద్రు రవీందర్ రెడ్డి సూచించారు. దోర్నకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంఈఓ లక్ష్మ, జిల్లా ఏఎస్ఓ చంద్రశేఖర్ ఆజాద్, డీఎస్ఓ అప్పారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి నర్సింహా రావు, టీచర్లు అప్పిరెడ్డి, రవి, కలపాల అనిత, దయయంతి, బిచ్యా, సాహెబ్ అలీ, శ్రీనివాస్‌లతో కలిసి మొక్కలు నాటిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రతిరోజూ తప్పనిసరిగా పాఠశాలకు హాజరైతే అనుకూల ఫలితాలు లభిస్తాయని డీఈఓ అన్నారు. ఈ విద్యా సంవత్సరం ముగిసేలోపు విద్యార్థులు రాసే పరీక్షల ద్వారా వారి ప్రెజెంటేషన్ స్కిల్స్, హ్యాండ్‌రైటింగ్‌లో మార్పులు వచ్చి, పరీక్షల పట్ల భయం లేకుండా పబ్లిక్ పరీక్షలు రాయవచ్చని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల పట్ల టీచర్లు అంకితభావంతో పనిచేసి, మళ్లీ మారోమారు మానుకోట జిల్లాను మొదటి స్థానంలో నిలబెట్టాలని సూచించారు.

# అంతరించిపోతున్న కళలను బతికించుకుందాం

- రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ పిలుపు



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ పల్లెల్లో ఆటలకు, పాటలకు విడదీయరాని బంధం ఉందని, అనేక కళారూపాల్లో ఇక్కడి కళలు పల్లె ప్రజల నాలుకపై నాట్యమాడుతాయని రాష్ట్ర కళాకారుల సంఘం అధ్యక్షుడు వంగ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పరకాల పట్టణంలోని ఎఫ్. జె. గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల కళాకారుల జిల్లా సదస్సు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర కార్యదర్శి తాళ్ల రమేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. జానపద కళలు తెలంగాణ ప్రజల కళారుచికి చక్కని నిదర్శనాలని, పల్లె ప్రకృతి రమణీయత, శ్రమ సౌందర్యం, తోటివారి పట్ల ఆప్యాయత, ప్రకృతిని ప్రేమించడం వంటివి జానపదాల్లో అంతర్లీన అంశాలని శ్రీనివాస్ గౌడ్ వివరించారు. హంగు, ఆర్భాటం లేకుండా సులువైన చిన్న చిన్న పదాలతో లోతైన అర్థాన్ని తెలియజెప్పడమే జానపద గొప్పదనమని ఆయన పేర్కొన్నారు. భిన్నత్వం నెలకొన్న భారతావనిలో భిన్న కళారూపాలు ప్రదర్శితమవుతూ వినోదాన్ని, మానసిక ప్రశాంతతను చేకూర్చుతాయని తెలిపారు. అయితే, ఈ కళలు క్రమంగా అంతరించిపోతూ అవసానదశకు చేరుకుంటున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శ్రీనివాస్ గౌడ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీ, ప్రధాన కార్యదర్శి ఉండేకోటి కవిత, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు నిమ్మలరాజు, దయాకర్, పూర్ణయ్య, సీనియర్ కళాకారులు బండి సమ్మయ్య, భూక్య శ్రీనివాస్, బర్ల గట్టయ్య, నల్ల ధర్మారెడ్డి, ఉడుత మల్లయ్య, కోగిల రవి (డబ్బాల్), సాద సాంబయ్య, హనుమంత రావు, గద్దం మూగయ్య, అలువాల రాజేందర్, పైళ్ల సమ్మయ్య, తాడేం సమ్మక్క, మాటేటి రజిత, జన్ను రజిత, పంగ భాగ్యలత, కోరుకంటి వనమాల తదితరులు పాల్గొన్నారు.

# ఈతకు వెళ్లి వ్యక్తి మృతి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఈతకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన డోర్నకల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ ప్రాంతానికి చెందిన ఎర్రం శెట్టి సందీప్ (32) వృత్తి రీత్యా డోర్నకల్ రైల్వే క్రులో ట్రైన్ గార్డ్ గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం ఈత కోసం సమీపంలోని మున్నేరు వాగు వద్ద చేరుకొని ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతిచెందారు. విషయం తెలుసుకున్న స్థానికులు రైల్వే డిపార్ట్ మెంట్ సభ్యులు వాగు వద్దకు చేరుకొని మునిగిపోయిన సందీప్ మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకోచ్చారు.

# ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ బస్టాండ్ పరిధిలో లో వాహనాల రద్దీ దృష్ట్యా బుధవారం హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీతా రెడ్డితో హనుమకొండ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ కలిసి చౌరస్తాలో షాపులు, ఫుట్ పాత్ ను ఆక్రమించి రోడ్లమీద పెట్టే తోపుడుబండ్లను తీయించారు. ఆటో డ్రైవర్లకు కూడా అనవసరంగా రోడ్ల మీద ఆటోలు నిలుపకుండా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని అలాగే అక్కడ ఉన్న హాస్పటల్, హోటల్, లాడ్జి యజమానులకు రోడ్డుమీద వెహికల్స్ పార్కింగ్ చేయకుండా చూడాలని సూచించారు. ఒకవేళ వెహికల్ రోడ్డు మీద పార్కింగ్ చేసి ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్లు హెచ్చరించారు.

# మా డివిజన్‌లో పర్యటించండి

## బల్దియా కమిషనర్‌ను కోరిన మరుపల్లి రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయిని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రధాన కార్యాలయంలో ఆమెకు బొకేను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపల్ల రవి తన డివిజన్‌లోని సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. తమ డివిజన్‌లో స్లమ్ ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయని, తగినంత అభివృద్ధి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ప్రజలు మట్టి రోడ్లపై ప్రయాణిస్తున్నారని, మరికొన్ని చోట్ల మంచినీటి పైపులు లేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను స్వయంగా పరిశీలించడానికి తమ డివిజన్‌లో పర్యటించాలని కమిషనర్‌ను కోరారు. కార్పొరేటర్ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, తప్పనిసరిగా డివిజన్‌లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు.

# అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** అర్హులైన నిరుపేదలందరికీ పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరకాల నియోజకవర్గంలో అర్హులైన అని నిరుపేదల పేర్లను తొలగించి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టానుసారంగా అనర్హులకు కట్టబెడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు పునర్విచారణ చేసి అర్హుల అందరికీ మంజూరు చేయాలని కోరారు.

# మహిళలు రాజకీయంగా ముందుకు సాగాలి

## ● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహిళలు రాజకీయంగా మరింత ముందుకు సాగాలని, పార్టీ బలోపేతానికి కీలక పాత్ర పోషించాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పిలుపునిచ్చారు. తొర్రూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో తొర్రూరు బ్లాక్ మహిళా అధ్యక్షురాలు పింగళి ఉష ఆధ్వర్యంలో నిర్వహించిన మహబూబాబాద్ జిల్లా బూత్ స్థాయి మహిళా మీటింగ్ ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి, మహబూబాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నునవత్ రాధ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు హాజరైన ఈ మీటింగ్‌లో నాయకురాళ్లు రాజకీయ చైతన్యం, పార్టీలో మహిళల పాత్ర, బూత్ స్థాయిలో చురుకైన కార్యకలాపాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, మహిళలు బూత్ స్థాయిలో రాజకీయాల్లో భాగమవుతున్న తీరును చూసి గర్వపడుతున్నానని అన్నారు. "మనం ఒకటిగా ఉంటేనే పార్టీ బలపడుతుంది. గ్రామస్థాయిలో ఉన్న ప్రతి మహిళా కార్యకర్త ఓ మార్పు సాధించగల శక్తి. మహిళలు ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే ఎన్నికల ఫలితాలు మన చేతుల్లోనే ఉంటాయి. కాంగ్రెస్ పార్టీ మహిళల సాధికారతకు పునాది వేసిన పార్టీ. ఆ దిశగా మనందరం చైతన్యవంతంగా ముందుకు సాగాలి" అని ఆమె అన్నారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు. బూత్ స్థాయి మహిళా కార్యకర్తలు పార్టీకి బలమైన పునాది అని, వారి శ్రమ, నిబద్ధత చూసి గర్వంగా ఉందని తెలిపారు. మహిళా నాయకురాలిగా యశస్విని రెడ్డి చూపుతున్న నాయకత్వం యువతరానికి ఆదర్శంగా నిలుస్తోందని, చిన్న వయసులోనే ఆమె ప్రజల సమస్యల పట్ల చూపిస్తున్న జాగ్రత్త, నిబద్ధత తనకు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. "ఈ సమావేశం మహిళా శక్తిని ఒక్కచోట చేర్చిన గొప్ప వేదిక. మనందరం సంఘటితంగా ముందుకు సాగితే, పాలకుర్తి మాత్రమే కాకుండా రాష్ట్రం అంతా మార్పు దిశగా కదులుతుందని ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ సంగీతను కలిసిన ఎన్ హెచ్ఎం ఉద్యోగులు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం)లో పనిచేస్తున్న దాదాపు 17 వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా బేసిక్ వేతనం ఇవ్వాలని తెలంగాణ ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ సంగీతను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ఎం ఉద్యోగుల సమస్యలను రామ రాజేష్ ఖన్నా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతినెలా ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలని కోరారు. గతంలో 510 జీవో వల్ల నష్టం జరిగిన 4000 మంది ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, ఉద్యోగులకు కొత్త జీవో రిలీజ్ చేయడానికి కొంచెం సమయం పడుతుందని హామీ ఇచ్చారు. అలాగే, గత ప్రభుత్వం పి.ఆర్.సి సందర్భంగా రావలసిన ఏడు నెలల పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఎన్ హెచ్ఎం ఆల్ క్యాడర్స్ క్యాడర్ ఫిక్సేషన్ చేయాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ (ఏఐటీయూసీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సారంగుల బాలసుబ్రమణ్యం, ఫిజియోథెరపిస్ట్ జైశీల, ఆయుష్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు.



# శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థాన కమిటీ ప్రమాణ స్వీకారం





**వరంగల్ వాయిస్, రంగశాయిపేట :** వరంగల్ నగరంలోని రంగశాయిపేట 42వ డివిజన్‌లో గల శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం బుధవారం ఘనంగా జరిగింది. అటవీ, దేవస్థాన శాఖ మంత్రి కొండా సురేఖ, మురళీధర్ రావు సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అనిల్ సమక్షంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ చైర్మన్‌గా పులిగిల్ల వెంకటరామనరసింహ శాస్త్రి బాధ్యతలు చేపట్టగా, ధర్మకర్తలుగా అవునూరి కుమార్, విలాసాగరం శ్రీనివాస్, వద్దిరాజు శ్రీనివాసరావు, బొల్లాపల్లి సరిత, సోమ అనిల్ ప్రమాణం చేశారు. అనంతరం ఆలయ పాలక మండలిని విలాసాగరం శ్రీనివాస్ శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంకట్రావు, స్థానిక కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్ధన్, వద్దిరాజు శ్యాంసుందర్రావు, మంథని సునీత, ఆలయ ప్రధాన పూజారి తిరుమలగిరి శ్రీధర్ ఆచార్యులు, మాజీ కమిటీ సభ్యులు వల్పదాసు కృష్ణ, కాంగ్రెస్ నాయకులు కేడల మల్లేశం, కర్ర కుమార్, పోశాల మల్లికార్జున్, బత్తిని వీరభద్రయ్య, విలాసాగరం శ్రీనివాస్ (పెద్ద), జినుక రమేష్, పాలకుర్తి సుమన్, రవి, బోలుగొడ్డు అనిల్, వనం వేణు, మునుకుంట్ల చంద్రమౌళి, పాకాల రాజేందర్, దువ్వసత్యం, మునుకుంట్ల విజయ, కోడిపాక రమాదేవి, చిదురాల సుజాత, శ్రీరామ భజన మండలి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# సీఆర్ పీఎఫ్ స్థలంలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మించాలి

## పీడీఎస్ యూ కేయూ కార్యవర్గం




**వరంగల్ వాయిస్, కే యూ :** సీఆర్ పీఎఫ్ స్థలంలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మించాలని పీడీఎస్ యూ కాకతీయ యూనివర్సిటీ కార్యవర్గం కోరింది. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం కాకతీయ యూనివర్సిటీ కార్యవర్గం ఆధ్వర్యంలో బుధవారం కాకతీయ యూనివర్సిటీలో పత్రికా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి కేటాయించిన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను రవాణాకు అనుకూలంగా అధిక సంఖ్యలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా హనుమకొండ నడిబొడ్డున కాకతీయ యూనివర్సిటీ సీఆర్ పీఎఫ్ క్యాంపు కు కేటాయించిన స్థలాన్ని తిరిగి స్వాధీనపరచుకొని నిర్మించాలని కోరారు. సీఆర్పీఎఫ్ క్యాంప్ తరలించిన తర్వాత ఆ స్థలం నిరుపయోగంగా ఉందని, ఆ స్థలంలో పాఠశాలను నిర్మిస్తే యూనివర్సిటీకి కూడా పెద్దగా ఇబ్బంది ఉండకుండా జిల్లాలోని ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. కాబట్టి, యూనివర్సిటీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆ స్థలాన్ని ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి పవన్ కళ్యాణ్, దీక్షిత్ రెడ్డి,శంకర్, మోక్షజ్ఞ, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# కియారా కోసం యష్ త్యాగం

కేజీఎఫ్' సిరీస్ ద్వారా దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న కన్నడ స్టార్ యష్.. తన కొత్త ప్రాజెక్ట్ 'టాక్సిక్' కోసం మరింత ఆసక్తికరంగా ప్రిపేర్ అవుతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా, ఇప్పటికే యష్ బర్త్‌డే స్పెషల్‌గా విడుదలైన గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ లభించింది.ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ కియారా అద్వానీ కూడా నటిస్తున్నారు. అయితే చిత్ర షూటింగ్ మొదలైన కొద్దికాలానికే కియారా గర్భవతిగా మారిన విషయం తెలిసిందే. అయితే గర్భవతిగా ఉన్న కియారాకు షూటింగ్ షెడ్యూల్ సులభంగా ఉండాలనే ఉద్దేశంతో, యష్ తన భాగమైన కొన్ని ముఖ్యమైన సన్నివేశాల షూటింగ్‌ను, బెంగళూరులో కాకుండా, ముంబైకి మార్చాలని నిర్ణయించారట. దీంతో ఆమెకు ప్రయాణ బాధ్యత తగ్గింది. ముంబైలోనే యష్, కియారాల మధ్య సన్నివేశాలను, త్వరగా షూట్ చేసి పూర్తి చేశారట. ఈ విషయం బయటకు వచ్చాక, యష్ సెన్సిటివిటీ, సహనభావం చూసిన ప్రేక్షకులు, అభిమానులు ఆయన పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఒక నటీమణి ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకుని, షూటింగ్ లొకేషన్ మార్చడం నిజంగా అరుదైన విషయం అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక ఈ భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో కూడా విడుదల కానుంది.









# ది రాజాసాబ్ .. ఓ ఎమోషనల్ స్టోరీ

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది రాజాసాబ్' బిగ్గెస్ట్ హారర్ ఫాంటసీ ఫిల్మ్‌గా సిద్ధమవుతోంది. ఈ సినిమా కథను ఉద్దేశించి దర్శకుడు మారుతి జాతీయ మీడియాతో మాట్లాడారు. ఇదొక ఎమోషనల్ స్టోరీ అని చెప్పారు. ప్రేక్షకులు తప్పకుండా కనెక్ట్ అవుతారన్నారు. ఇలాంటి కాన్సెప్ట్ ఇండియన్ స్క్రీన్స్‌పై ఇప్పటివరకూ రాలేదన్నారు. 'హవేలి రాజ్‌మహల్' సెట్, వీఎఫ్ఎక్స్ వర్క్‌ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 'ప్రభాస్ చిత్రాలకు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని, కథకు అనుగుణంగా భారీ సెట్స్ ఏర్పాటుచేశాం. వీఎఫ్ఎక్స్ విషయానికి వస్తే.. ప్రభాస్ సినిమాపై ప్రేక్షకుల్లో ఒక అంచనా ఉంటుంది. దానికి తగ్గట్టుగా వీఎఫ్ఎక్స్ వర్క్స్‌పై దృష్టిపెట్టాను. అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. నిర్మాణ సంస్థ కూడా బడ్జెట్ విషయంలో ఎక్కడా వెనుకాడలేదు. ప్రేక్షకులను మేము మోసం చేయాలనుకోవడం లేదు. వాస్తవికతకు వీఎఫ్ఎక్స్‌ను జోడిరచాలనేదే మా ఉద్దేశం. పూర్తిస్థాయిలో ఒక అబద్ధపు ప్రపంచాన్ని సృష్టించడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు' అని ఆయన చెప్పారు. సినిమా కోసం ప్రభాస్ ఎంతో శ్రమించారన్నారు. ప్రేక్షకులకు అద్భుతమైన చిత్రాన్ని అందించేందుకు ఆయన అన్నివిధాలుగా కష్టపడుతుంటారని వివరించారు. డిసెంబర్ 5న పాన్‌ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. సంజయ్‌దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా టీజర్ విడుదలైంది.




# జూలై 25కు కింగ్‌డమ్ లాక్ అయ్యిందా?

విజయ్ దేవరకొండ కెరీర్‌లో తెరకెక్కుతున్న అత్యంత కీలకమైన చిత్రం 'కింగ్‌డమ్'. తాజా సమాచారం ప్రకారం, 'కింగ్‌డమ్' సినిమా జూలై 25న, శుక్రవారం విడుదల కానుందని ఓ వార్త వైరల్ అవుతుంది. అధికారికంగా ఈ విషయంపై మేకర్స్ ప్రకటించనప్పటికీ, ఆ డేట్‌కే సినిమాను ప్లాన్ చేశారని ప్రచారం సాగుతోంది. గతంలో లైగర్, ఫ్యామిలీ స్టార్ వంటి ఫ్లాప్స్ కారణంగా.. విజయ్ మార్కెట్ మీద చాలా ప్రభావం పడిరది. ఈ నేపథ్యంలో 'కింగ్‌డమ్' ద్వారా తన కెరీర్‌ను మళ్లీ పైకి తీసుకెళ్లాలన్న నమ్మకంతో విజయ్ అడుగులు వేస్తున్నాడు. ఇక ఈ చిత్రానికి జెర్సీ వంటి హిట్‌ను అందించిన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు.విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే ఇది అత్యధిక బ్జడెట్ కలిగిన పాన్ ఇండియా చిత్రం. ఇక ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేయగా. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజయ్ లుక్ అన్నీ కలిసి సినిమాపై పాజిటివ్ బజ్ తెచ్చాయి. పాటలు, ట్రైలర్ లేదా మీడియా ఈవెంట్లపై ఎటువంటి అప్‌డేట్లు లేకపోవడం కొన్ని అనుమానాలు మొదలయ్యాయి. సాధారణంగా ఇలాంటి భారీ చిత్రాలు విడుదలకు రెండు నెలల ముందే సాంగ్స్, ఈవెంట్లు మొదలవుతాయి. కానీ 'కింగ్‌డమ్' మేకర్స్ ఇప్పటికీ ప్రమోషనల్ కార్యక్రమాలపై మౌనమే పాటిస్తున్నారు. ఫ్యాన్స్ మాత్రం చిత్రయూనిట్ నుంచి అధికారిక ప్రకటన కోసం ఆతురతగా ఎదురుచూస్తున్నారు.

# యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడమే కాకుండా, రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న యాదవ జాతికి కేబినెట్ లో చోటు లేకపోవడం సిగ్గుచేటని అఖిల భారత యాదవ సంఘం సభ్యుడు, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ విమర్శించారు. బుధవారం హనుమకొండ రాంనగర్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో అఖిల భారత యాదవ సంఘం సభ్యులు రాజారాం యాదవ్, గోవర్ధన్ యాదవ్, సుందర్ రాజ్ పాల్గొన్నారు. అనంతరం కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు లేరు అనే సాకుతో యాదవ జాతిని వెనకబాటుకు గురిచేయవద్దన్నారు. యాదవులకు వెంటనే మంత్రి పదవి కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతీ జిల్లాలో, నియోజకవర్గంలో యాదవ కులస్తులు ఆవేదనతో ఉన్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి మంచి మనసుతో అలోచించి కులానికి పదవి కల్పించాలని విన్నవించారు. ఈనెల 30వ తేదీన యాదవుల ఆత్మగౌరవ సభ హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ లో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. యాదవ బిడ్డలంతా భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.




### ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా..

యాదవ జేఏసీ ఆధ్వర్యంలో జూన్ 30న ఇందిరా పార్క్ లో యాదవ ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నామని అఖిల భారత యాదవ సంఘం సభ్యులు రాజారాం యాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కనివిప్పు కలిగేలా ఈ సభ ఉండబోతోందని పేర్కొన్నారు. సభను విజవంతం చేయడానికి ఉమ్మడి వరంగల్ జిల్లా యాదవులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రేవంత్ రెడ్డి కేబినెట్ లో యాదవ జాతికి పెద్ద పీట వేయాలని కోరారు. అనంతరం గోవర్ధన్ యాదవ్ మాట్లాడుతూ.. చరిత్రలో యాదవులు లేకుండా మంత్రి మండలి లేదని, యాదవ మంత్రి లేకుండా పాలన చేస్తున్న ఏకైక సీఎం రేవంత్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. యాదవులను మరిచిపోతే కచ్చితంగా తగిన మూల్యం చెల్లిస్తారన్నారు. మేకల కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు మొదటి అడుగు వేసి ఓట్లు వేసింది యాదవ జాతి బిడ్డలేనని గుర్తు చేశారు. యాదవులకు మంత్రి పదవి ఇవ్వకపోవడంలో కాంగ్రెస్ ఉద్దేశం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ యాదవ్, గీరబోయిన రాజయ్య యాదవ్, మాదం రజనీ కుమార్, సిద్ధిరాజు యాదవ్, గండ్రకోట రాకేష్ యాదవ్, పృధ్వి యాదవ్, ప్రమోద్ యాదవ్, సాయి యాదవ్, రాజు యాదవ్, బండి పర్వతాలు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళిలో 22న బంగారు బోనం

- పాల్గొననున్న మంత్రి సురేఖ
- వివరాలు తెలిపిన ఈఓ కె.శేషుభారతి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తం చేయడమే లక్ష్యంగా హైదరాబాద్ లోని లాల్ దర్వాజ మహంకాళి దేవస్థానం వారు గత 11 సంవత్సరాలుగా దేశం నలుమూలలా బోనాల కార్యక్రమాన్ని అమలు పర్చుతున్నారని భద్రకాళి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.శేషు భారతి తెలిపారు. అందులో భాగంగానే దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు ఈ సంవత్సరం నుంచి వరంగల్ నగరంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో కూడా బోనాల పండుగను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి బంగారు బోనం సమర్పించనున్నట్లు వెల్లడించారు. మంత్రితోపాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే



నాయిని రాజేందర్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజకు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులు అమ్మవారికి బొనం సమర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి జిల్లాల అధికార, అనధికార రాజకీయ ప్రముఖులు పాల్గొంటారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

### అహ్వానం కరువు..

శ్రీ భద్రకాళి దేవస్థానం ఆలయ కార్యనిర్వాహణ అధికారి కె.శేషుభారతి బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం వివాదాస్పదంగా మారింది. భద్రకాళి ట్రస్ బోర్డు సభ్యులుగా ఇంత వరకు ఎవరూ ప్రమాణ స్వీకారం చేయకపోయినప్పటికీ పాత్రికేయుల సమావేశంలో వారికి పెద్దపీట వేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు సమావేశం ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ కు ఆహ్వానం అందకపోవడం విడ్డూరంగా ఉందంటున్నారు. ఈఓ ఇష్టారాజ్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణమంటున్నారు.

# ల్యాదెల్లలో జానపద పాట చిత్రీకరణ



**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండ జిల్లా దామెర మండల నిపరిధిలోని ల్యాదెల్లలో బుధవారం 'సోలాపురం పోయినను' అనే జానపద పాటను చిత్రీకరించారు. ' ఫ్లై ఆన్ రీల్స్' యూ ట్యూబ్ ఛానల్ నిర్మిస్తున్న ఈ పాటలో చిత్రీకరణలో నటీ నటులుగా భ్రమరాంబికా, ఈశ్వర్ సాయి చేశారు. కాగా శేఖర్ వైరస్ కొరియోగ్రాఫర్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఫ్లై ఆన్ రీల్స్' ఫౌండర్స్ ఎన్. వినీత్, ఎల్. కృష్ణ, బి.శ్యామ్ సుందర్ లు మాట్లాడుతూ భార్య, భర్త మధ్య జరిగే సరసాలతో జానపద పాటను చిత్రీకరించినట్లు తెలిపారు. పాట చిత్రీకరణ సమయంలో సహకరించిన ల్యాదెల్ల గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# ఏసీబీ ట్రాప్ లో విద్యుత్ అధికారి


- రూ.80వేలు లంచం తీసుకుంటుండగా అదుపులోకి
- ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో దాడులు

మహబూబాబాద్ జిల్లా హస్తినాపురం కాలనీ విద్యుత్ అధికారి నరేష్ ఏసీబీ ట్రాప్ లో చిక్కుకున్నారు. గుత్తే దారుడు చేసిన పనులకు బిల్లులు చెల్లించేందుకు మహబూబాబాద్ విద్యుత్ శాఖ విభాగంలో సెక్షన్ ఇంజనీర్ గా పనిచేస్తున్న నరేష్ లంచం ఇవ్వాలంటూ ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో చేసేది లేక బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. బుధవారం బాధిత గుత్తేదారుడి నుంచి నరేష్ రూ.80 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని నగదును స్వాధీనం చేసుకున్నారు. నరేష్ ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో నరేష్ ఇంటిలోను సోదాలు నిర్వహిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. – వరంగల్ వాయిస్, మహబూబాబాద్




# నవాబ్స్ రెస్టారెంట్ లో కుళ్లిన మాంసం

- ఫుడ్ ఇన్ స్పెక్టర్ కు ఫిర్యాదు చేసిన వినియోగదారులు



**వరంగల్ వాయిస్, క్రైం :** హనుమకొండలోని నవాబ్స్ అరేబియన్ రెస్టారెంట్ లో కుళ్లిన, ఉడకని మాంసం విక్రయాలపై వినియోగదారులు బుధవారం హనుమకొండ ఫుడ్ ఇన్ స్పెక్టర్ ఫిర్యాదు చేశారు. సదరు రెస్టారెంట్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరానికి చెందిన రేవెల్లి నాగరాజు మిత్రులతో కలిసి బుధవారం మూడు గంటల ప్రాంతంలో నవాబ్స్ రెస్టారెంట్ వెళ్లి చికెన్ మండి ఆర్డర్ చేసినట్లు వెల్లడించారు. వేయిటర్ తెచ్చిన చికెన్ ఉడకకుండా పచ్చి పచ్చిగా ఉండడంతోపాటు కుళ్లిన వాసన రావడంతో విషయం రెస్టారెంట్ నిర్వాహకులకు తెలిపినట్లు వివరించారు. వారు స్పందించక పోవడంతో కుళ్లిన చికెన్ తినకుండా బయటకు వచ్చే ప్రయత్నం చేయగా యాజమాన్యం అడ్డు తగిలి దురుసుగా ప్రవర్తించడంతోపాటు దాడికి యత్నించినట్లు పేర్కొన్నారు. రెస్టారెంట్ చెఫ్ సైతం చికెన్ ఉడకలేదని, రక్తంతో ఉందని చెప్పినా వినకుండా నిర్వాహకులు దాడికి యత్నించారని తెలిపారు. ఈ విషయంలో ఫుడ్ ఇన్ స్పెక్టర్ విచారణ జరిపి రెస్టారెంట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు దీని ప్రతిని హనుమకొండ జిల్లా కలెక్టర్ కు అందించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com